# 12

# రెండు భోజనముల మధ్య గల తారతమ్యమును సంఘము విచక్షణాపూర్వకంగా వివేచించవలెను

## (1 కొరింథీయులకు 11:17-34)

ఒక సారి త్వరగా చదివి చూద్దాము అను ఆలోచనతో చదివిన తరువాత, 1 కొరింథీయులకు 11:17-34 వరకు గల వాక్యభాగము ప్రభువు రాత్రి భోజన సంస్కారమును గూర్చినది మాత్రమే అని మనము తేలికగా తీసికొనవచ్చును. వాస్తవమునకు, బైబిలులులోని సమిష్టి ఆనందానుభవమునకు సంబంధించిన అత్యధిక వర్ణనలతో కూడిన ఆదేశములు అందులో ఉన్నవి. మనకు ఈ ఆదేశములు అవసరమై యున్నవి ఎందుకనగా ప్రభువు దినమున ప్రభువు సంఘము ప్రభువును ఆరాధించుటలో ప్రభువు రాత్రి భోజన సంస్కారము ప్రధానాంశమై యున్నది. ఏదిఏమైనా, ఈ వాక్యభాగము కేవలము ప్రభువు రాత్రి భోజన సంస్కారము గూర్చినదే కాదు. నిజం చెప్పాలంటే అది రెండు భోజనముల గూర్చినదై యున్నది. గనుక మనము ఈ రెండింటి గూర్చి నేర్చుకొందాము.

"మీరు కూడివచ్చుట యెక్కువ కీడుకే గాని యెక్కువ మేలుకు కాదు గనుక నేను మిమ్మును మెచ్చుకొనను" అని కఠినంగా ప్రకటిస్తూ, పౌలు ప్రారంభించాడు (11:17).[1]

### సంఘ సామూహిక భోజనము, లేక సహవాస విందు

**దాని ఆచరణ**

సహవాస విందులు మొదటి శతాబ్దము నాటి సంఘము యొక్క సలక్షణమై యుండినది. యెరూషలేములో సంఘము స్థాపింపబడిన తరువాత, అది క్రైస్తవులు సహవాసమునకు తమ్మునుతాము అంకితము చేసికొన్నారు; వారు "తమకు కలిగినదంతయు సమిష్టిగా ఉంచుకొనిరి," "ఇంటింట రొట్టె విరుచుచుండిరి," "ఆహారము పుచ్చుకొనుచుండిరి" (అపొస్తులుల కార్యములు 2:44, 46, 47). అపొస్తలుల కార్యములు 20వ అధ్యాయంలో, శిష్యులు వారములోని మొదటి రోజున అనగా అదివారమున రొట్టె విరుచుటకు కూడుకొనినప్పుడు - అనగా, ప్రభువు రాత్రి భోజన సంస్కారములో పాలుపొందుటకు - వారు బయలుదేరి వెళ్లిపోక మునుపు సహవసించుచుండిరి (7-11 వచనాలు). నిరంతరము పాపములోనే జీవించుచుండిన క్రైస్తవుడొకరు ఉపసంహరింపబడినప్పుడు, సంఘము అట్టి వానితో సాంగత్యముగా కలిసి భోజనము చేయకూడదని ప్రత్యేకంగా ఆదేశింపబడినది (1 కొరింథీయులకు 5:11). "మీరు నిర్భయముగా మీతో సుభోజనము చేయుచు, తమ్మునుగామ నిర్భయముగా పోషించుకొనుచు, మీ ప్రేమవిందులలో దొంగమెట్టలుగా ఉన్నారు" అని యూదా చెడు జనుల గూర్చి క్రైస్తవులకు వ్రాయుచున్నాడు (యూదా 12). ఆది సంఘము సహవాస భోజనములలో, లేక ప్రేమ విందులలో క్రమముగా పాల్గొనుచుండుట

వారికొక అనుదిన అభ్యాసమై యుండినదని ఎన్నో నిదర్శనములు కలవు. నేటి సంఘము సహితము ఈ విధంగానే చేయుచున్నది.

కొరింథులో నెలకొల్పబడి యుండిన సంఘము ఇటువంటి భోజనములలో పాలుపొందుచుండినదని పౌలు ఇక్కడ సూచించుచు, ఇట్టి అభ్యాసమును ఆమోదించుచున్నట్లు అగుపించుచున్నాడు. అదే సమయంలో, సహోదరులు ఇట్టి భోజనములను నిర్వహించుచుండిన తీరు గూర్చి ఆయన వారిని గద్దించాడు.

**దాని దుర్వినియోగము (11:18-22)**

కొరింథులోని క్రైస్తవులు కూడుకొనినప్పుడు వారు చేయుచుండిన తప్పేమిటి?

*మొదటిగా, వారు విభజనలకు ప్రోత్సాహకమిచ్చుచుండిరి.* వారు కలిసి చేయుచుండిన భోజనములు కక్షలు కలుగజేసినవి (11:18, 19). విభజింపబడి యుంటూ విభజనలు కలుగుటకు కారణమగుచుండిన కొరింథీయులకు, భేదాభిప్రాయములు గల విభజనలను పెంచిపోషించుటకును ఆ విభజనలను వ్యక్తము చేయుటకును "ప్రేమ విందు" సహితము ఒక సబబైన సందర్భమైపోయింది.[2] ఎలాగు అయ్యింది? దానిని మనము ఊహించుకొనవచ్చును, కానీ బహుశ వారు సంఘ సామూహిక భోజన సమయంలో వెవ్వేరు బల్లలయొద్ద దూరదూరం కూర్చుండి యుందురు లేక కొందరు వారితో కూడ కలిసి భోజనము చేయుటకు నిరాకరించి యుందురు.

*రెండవదిగా, వారు సహవాస భోజనమునకును ప్రభువు రాత్రిభోజన సంస్కారమునకును గల తారతమ్యముతో తికమక పడుచుండిరి.* దాని ఫలితమేమంటే ఇట్టి సహవాస భోజనము యిక "ప్రభువు రాత్రి భోజన సంస్కారము" అని పిలువబడుటకు యోగ్యముకానంత హాస్యానుకృతియైపోయినది. అంచేతనే "మీరందరు కూడివచ్చుచుండగా, మీరు ప్రభువు రాత్రి భోజనము చేయుట సాధ్యము కాదు" అని పౌలు వారిని గద్దించుచున్నాడు (11:20). సంఘ సమూహమునకు సహవాస భోజనము విలువైనదై యున్నది, గనుక దీనిని ప్రభువు రాత్రి భోజనమునకు బదులుగా ఏర్పాటు చేసికొనకూడదు మరియు దానితో తికమక పడకూడదు.

*ప్రేమ విందు యొక్క మూడవ దుర్వినియోగము – భోజనమునకు కూడుకొనినప్పుడు వారు ఇతరుల గూర్చి సహితము ఆలోచించుటలో లేక పట్టించుకొనుటలో కొరింథీయులు విఫలులయ్యారు (11:21, 22).* ప్రతి ఒక్క వ్యక్తి, కుటుంబము. లేక గుంపు వారి వారి భోజనమును – వారి కొరకే తెచ్చుకొనిన ఆహారమును – ఇతరుల అవసరములను గూర్చి అలోచించకుండానే ఆరగించినప్పుడు – ఒక ప్రక్క కొందరి యొద్ద చాలినంత కంటె ఎక్కువ భోజనముండినది మరొక ప్రక్క కొందరి యొద్ద ఏమియు మిగులలేదు సరికదా వారి ఆకలి అసలే తీరలేదు. వాస్తవానికి, ధనికుల ఔదార్యముతో పేదలకు భోజనము పెట్టవలెననునది ఈ విధమైన భోజనమును ఏర్పాటు చేయుటలో అసలు ఉద్దేశమై యుండినదని స్పష్టమగుచున్నది,[3] కానీ ఈ భోజన సమయములో అసలు ఉద్దేశము నెరవేరకుండినది. దానికి బదులుగా, అది సంఘ సభ్యుల మధ్య తీవ్రమైన భేదాభిప్రాయములను కలుగజేయుచు వారి దృష్టిని అదివరకే నెలకొని ఉండిన విభజనాలవైపునకు మరింత ఎక్కువగా మళ్లించినది.

*సహవాస భోజనము యొక్క అసలు ఉద్దేశమును కొరింథీ సంఘస్థులు బొత్తిగా*

*అపార్థంచేసికొనుట నాలుగవ దుర్వినియోగము.* ఆ భోజనము వారి కడుపులు నింపుకొనుట కొరకే అని వారనుకొన్నారు (11:22). కానీ దాని అసలు ఉద్దేశము అది కాదు; సంఘము ఒక సమూహముగా కూడుకొనకుండానే శారీరక భోజన అవసరము సులభంగా తీర్చబడగలదు. "ఎవడైనను ఆకలిగొనిన యెడల తన యింటనే భోజనము చేయవలెను" అని చెప్పుచు పౌలు ఈ విషయాన్ని స్పష్టంచేసాడు (11:34బి). సహవాస భోజనము ప్రేమను, ఒకరితో నొకరికి దగ్గరి సంబంధమున్నదను భావమును కలుగజేయుచు, సమైక్యతను సాగుచేయుటకు ఉద్దేశింపబడినది; అది నిర్భాగ్యులైనవారు ఇబ్బందిపడకుండా సంపన్నులైనవారి నుండి కొంత సహాయము పొందుకొనగల సంతోష సమయమై యుండవలెనని భావింపబడినది. ఏదిఏమైనా, కొరింథీయులు సహవాస భోజనమును దుర్వినియోగము చేయుట వలన వారికి మేలు కంటె కీడే ఎక్కువ సంభవించినది.

**దాని హితము**

కొరింథీయులు చేసిన తప్పుల నుండి మనము నేర్చుకొనవలసి యున్నది. నేను దైవసందేశమును అందించిన ఒక సంఘములో, ఉదయకాల ఆరాధన ముగిసిన తరువాత, సహోదరులు సహవాస భోజన సందర్భములో మాసములోని ఒక ఆదివారం నాడు కూడుకొను వాడుక కలదు. ఆరాధన ముగియగానే, కొంత మంది స్త్రీలు చేయబడిన ఏర్పాట్లకు తుది మెరుగులు దిద్దిన తరువాత ప్రతి ఒక్కరు ఆలయము యొక్క క్రింది అంతస్తుకు వెళ్ళినప్పుడు పురుషుల సహవాస భోజన కార్యక్రమము ప్రారంభమౌతుంది. భోజనము బల్లల యొద్ద ఎవరి స్థానంలో వారు కూర్చున్నట్లయితే అందరికీ భోజనం వడ్డించబడుతుంది. మేము తినడం మొదలుపెట్టి ముగించక మునుపే, వారి పని వారు చేసికొని స్థలమంతటిని శుభ్రము చేసి వెంటనే వెళ్లిపోవాలని చెబుతూ మేము త్వరత్వరగా ముగించాలని మమ్ములను ఆతురపెట్టుటకు ఆరంభిస్తారు. భోజనానికి ముందు గాని లేదా భోజన సమయములో గాని ఒకరి నొకరు సందర్శించుకొనుటకును, ఒకరి నొకరు పరిచయము చేసికొని మరింత శ్రేష్టముగా తెలిసికొనుటకును దొరకు సమయము చాలా తక్కువ.

అనేక మాసములు ఇటువంటి అనుభవములు చవిగొన్న తరువాత, ఒక ఆదివారం ఉదయం మా సాంప్రదాయిక భోజనమునకు ముందు, నేను అందరూ తెలిసికొనవలెనని కొన్ని విశేషమైన ప్రాథమిక విషయాలను పేర్కొన్నాను. "మీకింత తొందర ఎందుకు?" అనడిగాను. ఆ తరువాత ఇటువంటి సహవాస భోజనముల ముఖ్య ఉద్దేశం గూర్చి ఉపదేశించాను. ఇవి కేవలము తినడానికే కాదు గాని, ఏవో కొన్ని ఉన్నతాశయములను నెరవేర్చుటకు ఉద్దేశింపబడినవని వివరించాను. సహవాస భోజనములో క్రీస్తు నందలి సహోదర సహోదరీలముగా పాల్గొనుటకు మనము కూడుకొనునప్పుడు, ఈ వాస్తవమును మనము జ్ఞాపకముంచుకొనవలెను. సహవాస భోజనము సమైక్యతను పెంచిపోషించుచు, ప్రేమను ప్రోత్సాహించుచు, పేదలకు ప్రయోజనము చేకూర్చనిదైనట్లయితే, మనము ఇంటి యొద్ద భోజనంచేయడమే మంచిది.

## ప్రభువు రాత్రి భోజనము[4]

1 కొరింథీయులకు 11:17-34 వరకు గల వాక్యభాగము సహవాస భోజనము గూర్చి

పౌలు ఇచ్చిన ఆదేశములను మనకు తెలియజేయుటతో పాటు, ప్రభువు రాత్రి భోజనము గూర్చి కూడ బోధించుచున్నది. ప్రభువు రాత్రి భోజనము ఏమై యున్నది మరియు దానిలో పాల్గొనడమెలా మొదలైన విషయాలను పౌలు వివరించుచున్నాడు.

## ప్రభువు రాత్రి భోజనము ఏమై యున్నది? (11:23-26)

*ప్రభువు రాత్రి భోజనమును యేసు,* మన ప్రభువు, స్థాపించాడు. గనుక మనము దానిని తేలికగా ఎంచుటకు గాని లేక దానిని అలక్ష్యము చేయుటకు గాని సాహసించలేము!

*ఈ భోజనమును ఆయన మనకు ఒక సంస్మరణ విందుగా ఏర్పాటు చేసాడు.* "నన్ను జ్ఞాపకం చేసికొనుటకై దీనిని చేయుడి" అని యేసు చెప్పాడు. రొట్టె ఆయన శరీరమునకు స్మారక చిహ్నముగా నున్నది, గిన్నె మన పాపములు క్షమింపబడులాగున ఆయన చిందించిన రక్తమును గుర్తు చేయుచున్నది. మనము ప్రభు భోజన సంస్కారములో పాల్గొనునప్పుడు, ఆయన మరణమును స్మరించుకొంటూ, ఆయన మన కొరకు సిలువ మీద ఏంచేసాడో ధ్యానిస్తూ పాలుపొందవలెను.

*తన శరీరములో అవయములై యున్నవారు గొర్రెపిల్ల రక్తము చేత విమోచింపబడ్డారని ఆయన వారికి గుర్తుచేయుటకు యేసు ప్రభువు రాత్రి భోజనమును స్థాపించాడు.* వారు ఐగుప్తులో నివసించుచుండినప్పుడు ఒక గొర్రెపిల్ల రక్తము చిందింపబడుట ద్వారా వారి తొలి సంతానము మరణము నుండి రక్షింపబడినదని ఇశ్రాయేలీయులు ప్రతి సంవత్సరము పాటించుచుండిన పస్కాపండుగ వారికి గుర్తుచేసినట్లే, క్రీస్తు రక్తము ద్వారా మనము పాపము యొక్క దాస్యము నుండి రక్షింపబడిన, దేవుని ప్రజలమై యున్నామని మనము ప్రతి (ఆది) వారము పాటించు ప్రభువు రాత్రి భోజనము మనకు గుర్తుచేయుచున్నది.

ప్రభువు రాత్రి భోజన సంస్కారము సంఘమునకు ఇవ్వబడినదను వాస్తవము అది దేవుని రాజ్యములో భాగమైయుండుటయని నొక్కి చెప్పుచున్నది. "నా తండ్రి రాజ్యములో మీతో కూడ నేను ఈ ద్రాక్షారసము క్రొత్తదిగా త్రాగు దినము వరకు, ఇకను దాని త్రాగను" అని యేసు చెప్పాడు (మత్తయ 26:29). సంఘములో లేనివారు ప్రభువు రాత్రి భోజన సంస్కారములో పాలుపొందినట్లయితే ఏ హాని కలుగదు, పాల్గొనుటకు లభించు ప్రత్యేకార్హత నిజముగా రాజ్యములోను, సంఘములోను చేరియున్నవారికొరకై యున్నది. ఈ ప్రత్యేకార్హతను ఆశించు ప్రతివాడు సంఘములో పాలిభాగస్థుడై యుండవలెను.

మనము ప్రభువు రాత్రి భోజనములో పాల్గొనునప్పుడెల్లా తద్వారా మనము "ఆయన వచ్చు పర్యంతము" ఆయన మరణమును ప్రచురించుచుందుమని పౌలు చెప్పుచున్నాడు (11:26). అటు తరువాత మనము ఆయనతో నిరంతరముండునట్లు ఆయన మనలను కొనిపోవును.

## ప్రభువు రాత్రి భోజనములో ఎట్లు పాల్గొనవలెను (11:27-34)

మనము 1 కొరింథీయులకు 11:17-34 వరకు గల వాక్యభాగములో నుండి ఈ భోజనములో మనము ఎలా పాల్గొనవలెనో కూడ నేర్చుకొందుము.

*మనము దానిని యోగ్యమైన రీతిలో పుచ్చుకొనవలెను (11:27).* అలాగని, మనము యోగ్యమైనవారమై యుండాలని దీని అర్థం కాదు. యేసు చేసిన బలియాగమునకు ఎవ్వరునూ

యోగ్యులు కారు. అలాగని, మనము పాపరహితులమై యుండాలని దీని అర్థం కాదు. మనము పాపములేనివారమై యుండాలంటే, అసలు ఎవరునూ పాల్గొనలేరు. గడచిన వారము రోజుల్లో పాపము చేసిన క్రైస్తవుడు ఈ ఆదివారం నాటి ప్రభువు రాత్రి భోజనములో పాల్గొనకూడదని కొందరు నమ్ముదురు, *కానీ ఈ దృక్పథము సరైనది కాదు!* పాపము చేసినందువలన ప్రభువు రాత్రి భోజనమును యోగ్యముగా ఆచరించుటకు విఫలులమగుట వలన దాని పరిణామములు దానికుండును. మనము బల్లలో సరైన విధముగా పాల్గొననట్లయితే, మనము ఎన్నో పర్యవసానములను అనుభవించుదుమని పౌలు చెప్పుచున్నాడు.

మనము ప్రభువు రాత్రి భోజనములో యోగ్యముగా ఎలా పాల్గొనవలెనో లేఖనములు నిర్దిష్టమైన ఆదేశములనిచ్చుచున్నవి.

(1) మనలను మనము "పరీక్షించి చూచుకొనవలెను" (11:28) – మనము పరీక్షించాల్సింది ఇతరులను కాదు. మనలను మనము పరీక్షించుకొన్నప్పుడు, మన హృదయములు కదిలింపబడి ఆయన కృప కొరకు దేవుని స్తుతించుటకు ఉప్పొంగును మరియు మనము మన పాపముల నిమిత్తమైన క్షమాపణ కొరకు వెదకునట్లును మనలను మనము ప్రభువు కొరకు పునః ప్రతిష్ఠ చేసికొనునట్లును ప్రోత్సాహింపబడుదుము.

ప్రభువు రాత్రి భోజనము కాలములోని ప్రతి కోణమునకును సంబంధము కలిగినదై యున్నది. వెనుదిరిగి గతంలోకి చూస్తే – మనము రక్షింపబడునట్లు యేసు సిలువ మీద మరణించుటను వీక్షిస్తాము. ఇందుకు అంతరంగము లోనికి చూచుకొంటూ – మన ప్రస్తుతకాల పరిస్థితే ఎలా ఉన్నదో, గొర్రెపిల్ల రక్తమునకు అయోగ్యులమే కానీ ఎలాగైతేనేమి రక్షింపబడితిమి కదా యని పరీక్షించుకొనుట అవసరమై యున్నది! ముందుకు భవిష్యత్తులోనికి చూడాలి – ప్రభువు తిరిగి వస్తాడని ప్రకటించాలి! "మీరు ఈ రొట్టెను తిని యీ పాత్రలోనిది త్రాగునప్పుడెల్ల. ప్రభువు వచ్చు వరకు ఆయన మరణమును ప్రచురించుదురు" అని పౌలు రచించాడు (11:26). మనము ప్రభువు బల్ల యొద్ద కూడుకొనినప్పుడు వర్తమాన, భూత, భవిష్యత్ కాలములు కలిసికొనుచున్నవి.

(2) మనము శరీరము గూర్చి కూడ "తీర్పు తీర్చుకొనవలెను" లేక "విమర్శించుకొనవలెను" (KJV; RSV) (11:29–32). "ప్రభువు శరీరమని వివేచింపక తిని త్రాగువాడు, తనక శిక్షావిధి కలుగుటకే తిని త్రాగుచున్నాడు" అని పౌలు చెప్పుటలో గల ఆయన భావమేమిటి (11:29)? ఆయన సిలువపై వ్రేలాడుచుండిన క్రీస్తు శరీరమును సూచించుచుండెననునది ఒక అర్థమై యుండవచ్చును. క్రీస్తు మన కొరకే మరణించాడని మనము జ్ఞాపకముంచుకొనవలెను. పౌలు క్రీస్తు యొక్క ఆధ్యాత్మిక శరీరమును, సంఘమును సూచించుచుండెననునది మరొక సాధ్యతయై యున్నది. ఆయన మనస్సులో ఉండిన అర్థం ఇదే అయినట్లయితే, మనము సంఘము గూర్చి ఆలోచించవలెనని పౌలు చెప్పుచున్నాడు. ప్రభువు రాత్రి భోజనము ఒక సామాజిక కార్యకలాపమై యున్నది, సంఘములోని సభ్యులందరు కలిసి చేయు ఒక సత్కార్యమై యున్నది. బహుశ కొరింథీయులు ప్రభువు రాత్రి భోజనమును పాటించుచుండిన సమయంలో ఒకని గూర్చి మరొకడు ఇలా ప్రతి వాడు ఇతరుల గూర్చి ఆలోచించుటలో విఫలులగుటను పౌలు ఇక్కడ సూచించి యుండవచ్చును.

(3) మనము "ఒకని కొరకు ఒకడు కనిపెట్టుకొని యుండవలెను" (11:33, 34). ప్రభువు రాత్రి భోజనము గూర్చిన తన చర్చ ముగింపులో, కొరింథీయులు "భోజనము చేయుటకు"

కూడుకొనుచుండిన సమయమును, అనగా సహవాస భోజనము మరియు ప్రభువు రాత్రి భోజనముతో తికమకపడిన సమయము గూర్చి పౌలు పునః ప్రస్తావించుచున్నాడు. "ఒకరి కొరకు వేచియుండండి. మీరు ప్రభువు రాత్రి భోజనములో పాల్గొనుచుండినా లేదా సహవాస విందులో పాల్గొనుచుండినా, ఇతరులు కూడ తినుటకు సిద్ధముగా లేనంత వరకు మీరు భోజనమునకు కూర్చోగానే తినుటకారంభించవద్దు" అని ఆయన చెప్పుచుండెను.

"ఒకని కొరకు మరొకడు కనిపెట్టుకొని యుండుడి" అను మందలింపు ప్రభువు రాత్రి భోజనము ఒక సహవాసము కొరకు అందరూ కూడుకొనుట – పంచుకొనుట, సహవసించుటయైయున్నదను వాస్తవమును నొక్కివక్కాణించుచున్నది. 1 కొరింథీయులకు 10:16 ప్రకారము, మనము ప్రభువు రాత్రి భోజనమును పుచ్చుకొనునప్పుడు, మనము క్రీస్తు యొక్క రక్తమాంసములలో పాలు పంచుకొనుచున్నాము. "ప్రభువు బల్ల"లో (10:21) ప్రభువుతో పొందుకొనగల సహవాసము కలదు; మనము ఈ విందులో ఆయనతో కూడ పాల్గొనుచుందుము (మత్తయి 26:29). ఏది ఏమైనా, మనకు జ్ఞాపకమునకుతెచ్చు క్షణములను వారితో కూడ పంచుకొనునప్పుడు ఇతర శిష్యులతో సత్సంబంధము, లేక సహవాసము కలిగియుందుము.

*మనము ప్రభు రాత్రి భోజనమును యోగ్యముగా పుచ్చుకొననియెడల పర్యవసానములుగలవు.* సహవాస భోజనమును సరిగ్గా తీసుకొనినయెడల దాని వలన అనేక ప్రతిఫలాలను అనుభవించుదమని పౌలు చెప్పాడు.

- 27వ వచనం ప్రకారము, మనము "ప్రభువు యొక్క శరీరమును గూర్చియు రక్తమును గూర్చియు అపరాధులమౌదుము" అనగా మనము ప్రభువు రాత్రి భోజనమును సరైన విధానములో తీసికొననట్లయితే, మనము క్రీస్తును మరలా సిలువవేయుచున్న దోషులమౌదుమని మరో మాటలో చెప్పుకొనవచ్చును!
- 29వ వచనం ప్రకారము, మనము "అది ప్రభువు శరీరమని సరైన విధంగా వివేచింపనట్లయితే" మనకు మనమే శిక్షావిధి తెచ్చుకొందుము.
- 30వ వచనం ప్రకారము, మనము ప్రభువు భోజన సంస్కారములో సరైన విధంగా పాల్గొననట్లయితే, ఆధ్యాత్మికముగా "రోగగ్రస్థులమై మరణించినవారమౌదుము."
- 31 మరియు 32వ వచనము ప్రకారము, మనలను మనము పరీక్షించి చూచుకొననట్లయితే లేక "శరీరమును సరైన రీతిలో విమర్శించనట్లయితే," మనకు తీర్పు తీర్చబడును మరియు ప్రభువు చేత క్రమశిక్షణలో పెట్టబడుదుము. గనుక మనలను మనము పరీక్షించి చూచుకొనుట లేదా ప్రభువు చేత పరీక్షింపబడి శిక్షింపబడుట అనునవి మనకు అందుబాటులో నున్న ప్రత్యామ్నాయములై యున్నవి.

**ముగింపు**

నేటి సంఘములు వాటి సమస్యలను పరిష్కరించుకొనుటకును ఆత్మలను ప్రభువు కొరకు సంపాదించుటకును సహాయపడు సలహాలను పౌలు ఆదేశములు మనకిచ్చుచున్నవి. రెండు సామన్య సూత్రములు అమలు పర్చుటకు అనువైనవై యున్నవి.

**"మీ సహవాసమును ప్రయోజనము పొందుకొనజేయుము"**

సహవాస తరుణములు ఆధ్యాత్మికముగా మేలును సమకూర్చునవగునట్లు చేయవలెనని మనము స్థిరబుద్ధిగలవారమై యుండవలెను. సంఘ సభ్యులు సంఘ సహవాసములో ఆనందానుభూతి చెందునట్లు సంఘములు సాంప్రదాయికమైన ఆరాధనా సేవలకు వెలుపల అవకాశములను సమకూర్చుచుండవలెను. ఉదాహరణకు। సహవాస విందులు, లేదా "అందుబాటులో ఉండు అందరూ తెచ్చిన ఆహారపదార్థములను ఆరగించుట" మొ।। వాటిని సభ్యులు ఆనందంగా అనుభవిస్తారు. "... ఫలానా విధంగా చేస్తే అది అందరికీ వినోదంగా ఉంటుందా?" అనునది సహవాసమునకు సముచితమగు ఏ సదవకాశము గూర్చియైనను వేసికొనవలసిన ముఖ్యమైన ప్రశ్న కాదు. "... ఫలానా విధంగా చేస్తే అది పేదలకు మేలైనదై యుండునా, ఐక్యతను అధికంచేయునా, ఆధ్యాత్మక ఎదుగుదలను ప్రోత్సాహించునా, సహోదర ప్రేమలో వృద్ధి కలుగజేయునా, మరియు సంఘములోని విభిన్న గుంపుల మధ్య అత్యధిక సామరస్యపూరిత అవగాహన కలుగుటకు కారణమగునా?" మొదలైనవి యథార్థమైన పరీక్షా ప్రశ్నలై యుండవలెను.

**"మీరు పాలుపొందు ప్రభువు రాత్రి భోజనమును అర్థవంతమైనదానిగా చేయండి"**

మనము పాలుపొందు ప్రభువు రాత్రి భోజనమును అర్థవంతమైనదానిగా చేయాలి. ప్రభువు రాత్రి భోజనమను సహవాస సంబంధ సత్కార్యములో పాలుపొందుట ద్వారా, మనము కేవలము సాంప్రదాయకమైన ఒక క్రతువులో నిమగ్నమగుచున్నామను ఆలోచన మనకు తట్ట వచ్చును. అయితే ఇటువంటి ఆలోచన ఉన్నప్పుడు, మనము ప్రభువు రాత్రి భోజనములో పాల్గొనునప్పుడు మనము ఏమి చేస్తూన్నాము ఎలా చేస్తున్నాము అను కోణాల్లో ఏమంత తేడా ఏర్పడదని మనము భావింపవచ్చును. 1 కొరింథీయులకు 11వ అధ్యాయం ఈ దృక్పథము తప్పని నిరూపించుచున్నది. నిజముగా, మనము ప్రభువు రాత్రి భోజనమును పుచ్చుకొనునప్పుడు – మనము పాటలు పాడుచు ప్రార్థించుచు అధ్యయనము చేయుచు ఇచ్చుచుండుట వలెనే – మనము, ఒక విధంగా చూస్తే, ఒక సంస్కార విధిలో పాలుపొందుచున్నాము. ఏదిఏమైనా,

రాత్రి భోజనములో పాల్గొనకపోవుట వాస్తవానికి మరొక పాపమౌతుంది. వాడు చేసిన పాపము గూర్చి తలంచుచూ ఫలితంగా వాడు ప్రభువు రాత్రి భోజనములో పాల్గొనుటకు వెనుకంజవేయుచున్నాడని ఇంతగా బాధపడువాడు ఆ పాపము గూర్చి ఏదో ఒకటి చేయవలెను కదా, అంతే గాని వాడు ఈ సహవాస విందును అలక్ష్యము చేయకూడదు.

---

సూచనలు

[1]11:17లో "నేను మిమ్మును మెచ్చుకొనను" అని పౌలు చేయుచున్న ప్రకటన (ఈ అభిప్రాయము 11:22లోను కలదు) – 11:2లో "ఇప్పుడు మిమ్మును మెచ్చుకొనుచున్నాను" అని చెప్పిన దానితో పోల్చి చూస్తే అది తారతమ్యము గలదై యున్నదని చూపించుటకు ఉద్దేశింపబడినది. [2]సంఘము ఏర్పాటుచేయు "ప్రేమ విందు" సంఘమును "సమైక్యపర్చుచు దానిని ఉద్ధరించు అనుభవముగా" ఉండునట్లుగా రూపొందించబడినది, దానికి బదులుగా, కొరింథులో, విభజనను మరియు అనైక్యతను పెంచిపోషించినదగుట హాస్యస్పదముగానున్నది. (Millard J. Berquist, *Studies in First Corinthians* [Nashville: Convention Press, 1960], 85). [3]క్రీ.శ. 51వ సంవత్సరములో (పౌలు అచ్చట ఒకటిన్నర సం।।లు గడిపి, అక్కడ నుండి

వెళ్లిపోయిన కొద్ది దినములకే) కొరింథు నగరంలో బహుశ క్షామము ఏర్పడియుండవచ్చును, గనుక సంపన్నులు వారి ఆహారమును పేదలతోపంచుకొనవలసిన అవసరం ఏర్పడింది. అంతమాత్రమేగాక, పౌలు "ఇప్పటి ఇబ్బందినిబట్టి" అని వ్రాసినప్పుడు ఈ క్షామము వలన ఏర్పడిన ఫలితములను సూచించి యుండవచ్చును (7:26). (B. B. Blue, "Love Feast," in *Dictionary of Paul and His letters,* ed. Gerald F. Hawthorne, Ralph P. Martin, and Daniel G. Reid [Downers Grove, III.: InterVarsity Press, 1993], 579.) [4]11:20లో పౌలు జ్ఞాపకార్థ విందును "ప్రభువు రాత్రి భోజనము" అని పిలుచుచున్నాడు. అది 1 కొరింథీయులకు 10:21లో "ప్రభువు బల్లగా" వర్ణింపబడినది. దానిని "ప్రభు భోజన సంస్కారము" అని కూడ పిలువవచ్చును. ఎందుకనగా, ఈ భోజనములో క్రైస్తవులు పాల్గొన్నప్పుడు వారు క్రీస్తుతోను సహ విశ్వాసులతోను సన్నిహిత సంబంధమును కలిగియుందురు. దీనిని "రొట్టె విరుచుట" అని కూడ సంబోధిస్తారు (అపొస్తలుల కార్యములు 2:42; 1 కొరింథీయులకు 10:16; అపొస్తలుల కార్యములు 20:7 చూడుము).